మార్పు

ఉన్నట్టుండి నాన్న పెద్దవాడై కూచుంటాడని వుద్యోగంలోబడ్డ సత్యానికి వూహించడానికైనా అవకాశం లేకపోయింది. ఇన్నాళ్ళ నుంచీ యింటి పెత్తనం చేస్తున్న నాన్నకు అకస్మాత్తుగా రెండు మోకాళ్ళూ పట్టుకుపోయి గడప దిగటంలేదు. తాలూకాఫీసులో గుమాస్తాగిరి చేస్తున్న సత్యంమీద మరికొన్ని ఫైళ్ళుపడ్డాయి, యింటి వుద్యోగం కూడా కలిసి వొచ్చేసరికి.

ఏ నెలా సత్యం సంపాదించే ఆ నాలుగురాళ్ళతో ఎప్పుడూ ఇల్లుగడవదు గనుక, అమ్మ చేతులు అడ్డాలు పెడ్తున్నా అటుండమంటూ స్వగ్రామంలో - పోయిందిపోగా మిగిలివుంటూ వొచ్చిన - రెండూ ముప్పాతిక ఎకరంలో రెండెకరాల మాగాణీ భూమిని లోగడే యోగ్యత గలవారికి సద్విక్రయం చేశాడు నాన్న.

ఏపని మొదలుబెట్టినా ఆసాంతం చూడంది విడిచేమనిషి కాదు నాన్న. వున్న ముప్పాతికా వుండి వుద్ధరించే దేవిటి శిస్తు కూలీలు దండగ కాకపోతే- అని మరీ దరిమిలానుంచి ఆలోచనలు పీడగా నెడ్తూంటంవల్ల - మోకాళ్ళుపడ్డ మర్నాడే మందులన్నా తిని బతుకుతానంటూ, ఆ ముప్పాతిక ఎకరం విక్రయం సత్యం చేతులకు వొప్పగించారు నాన్న.

దివాళా వ్యవహారంలో మొహం చూపించేందుకు మనస్సు కంగాళీగా వున్నా పదేళ్ళకు మళ్ళీ స్వగ్రామాన్ని చూసే అవకాశం దొరికినందుకు సత్యానికి ఇంకొకవైపు ఆనందం కలగకపోలేదు.

స్టేషన్నుంచి అన్ని మైళ్ళూ ఆలోచనల్లోబడి నడుస్తూ వొచ్చిన సత్యం స్వగ్రామం పరిసరాల పిల్లకాలవల దగ్గిరకొచ్చి వెనకటి ఆ నీటివాసన తగిలేసరికి ఒక్క శ్వాస విడిచి తలెత్తి చూశాడు తన చుట్టుపక్కలా.

ఆ పిల్లకాలవలు మెలికలు మెలికలు తిరుగుతూ దూరపు చేలల్లోకి మాయమవటం, వాటి నీటిపారుదలవైనం, అంచుల్నే మెత్తగా పేరుకున్న ఒండ్రునూ ఒకక్షణం- ఆవిధంగా- చూసి చప్పున రోడ్డు మీద కంకర్రాయి నొకటి దీసి ఒండ్రులోకి "ఠాప్పున" విసిరేసి, అది మాయంకాగానే చేతులు దులుపుకుంటూ గబగబ పది అడుగులు

ముందుకేసి - టఫీమని బ్రేకువేసినట్టు ఆగిపోయి వెనక్కు తిరిగిచూశాడు సత్యం. మూడడుగులవెనక ఆ మూలతిరుగుడులోనే వుంది ఆ గానుగ చెట్టు. ఆశ్చర్యం, తను దాన్ని గమనించకుండానే ముందుకు పోటం! ఆ గానుగచెట్టు మీద తను కొన్ని జీవితాలకి సరిపొయ్యే కోతి కొమ్మంచులాట లాడాడు.

వెంకయ్య ఏమయినాడో! ఒకరోజు వెంకయ్య కాకమీద తనను కూతతో తాకి ఔటు చేస్తానని శపథం చేసి "కోతికోజ్జిల్లా" రంటూ కూత పెడ్తూ వొచ్చి చెట్టు గజం ఎక్కేసరికి కట్టుకున్న పంచవూడి కిందపడ్డది. నిమిషంలో వెయ్యోవంతులో వెంకయ్య నిర్ణయించుకోవాలి- శపథం ప్రకారం తనను ఔటు చేయటమో, గుక్క అయిపొయ్యేటట్టు పంచ కట్టుకుంటూ పంతం చెల్లించుకోలేక పోవటమో వెంకయ్య మొండిమొలతో, గుక్క ఆపకుండా చెట్టెక్కటం చూసి, తనకు గుండె దిగజారి పట్టుదప్పి కిందపడి పరుగెత్తటానికి ప్రయత్నించేలోపల- తభాల్న ఔటుచేసి పంచగట్టుకున్నాడు; మిగతా ఆటగాళ్ళు నోళ్ళుదెరిచి చూస్తుంటే, పక్కనవ్వు నవ్వుతూ.

ఆ దృశ్యాన్ని చెట్టుమీద పోల్చుకుంటానికి అది అంగవికలంగా బోడిదై బీటలుదీసి నుంచునివుంది. ఆ గానుగుచెట్టు తనకు దూరమయిందీ, తను గానుగు చెట్టుకు దూరమయిందీ బోధపడలేదు సత్యానికి.

అక్కణ్ణుంచే వుత్తరంగా చేలల్లోగుండా స్వగ్రామం కనిపిస్తూంది. పూర్వం తను పరాయివూరు వెళ్ళి తిరిగివస్తూ యీ మూలనుండే చూసేవాడు. రామయ్యగారి ఎర్ర బంగాళాపెంకుల డాబాకు వెనుకగా వంటపొగతెరల్లోంచి తొంగిచూస్తుండే స్వగ్రామాన్ని, ఆ ఎర్రడాబా కనిపించగానే ఎంత ఆనందంగా వుండేది వూరు సమీపాన్ననుభవిస్తూ! చెట్లు చుట్టూతా దట్టంగా పెరిగి యిప్పుడా ఎర్రడాబా, ఆ దృశ్యం, కనుపించకపొయ్యేసరికి ఒక్క క్షణంపాటు సత్యం గుండె బీటు ఆగింది.

ఏమయినా తనకీ గ్రామంమీద ఏమధికారం ఉంది? భూమి మిగల్లేదు' పదేళ్ళనుంచి శూన్యంగా వున్న ఇల్లు-అది ముందు ఏ క్షణన్నయినా ఇతర్లకు చేర్తుంది. ఊళ్ళో చుట్టాలుపక్కాల్తో సానుభూతి సంపర్కాలు పంచుకొనే అవకాశం అంతకన్నా లేదు. తనలాగా ఇలాంటి స్వగ్రామాలున్న అభాగ్యులు చాలామంది తోడున్నా రనుకొన్నాడు సత్యం. అయినా వూరి పొలిమేరలోకి అడుగు పెట్టినప్పట్నుంచీ తన ఒళ్ళు అర్థంగాని వుత్సాహంతో చువ్వ వొంగినట్టు వొంగుతున్నది.

గనువుఁల వెంట గొడ్లమందల్ని చూసి నవ్వుకున్నాడు సత్యం, "ఖడే జర్ఖడే" అంటూ కొండెజడ సుబ్బాం పరికిణీ ఎగురుకుంటూ పరుగెత్తటం జ్ఞాపకం వొచ్చి.

ఆ వొస్తున్నది పాపయ్యే. తమాషాగా పెద్దవాడయినాడు. దూరాన్నుంచే కళ్ళకు చెయ్యి అడ్డం పెట్టుకుని చూస్తూ వొచ్చి, 'అంతా బాగుందారుగా?" మాటవరసకు అడిగినట్లు

అడిగి దాటిపోయినాడు పాపయ్య. గొడ్లపిల్లకాయల్ని కూడా దాటినాక సత్యానికి అనుమానం కలిగింది యీ మనుష్యులకూ తనకూ దూరం ఏర్పడిందని.

వూళ్ళోకి ప్రవేశిస్తూనే భావయ్యగారింటి ముందర దృష్టి ఆగింది సత్యానికి. ఆ పొడుగుపాటి అరుగుమీద భావయ్యగారు కనుపించకపోవడ శుభశకునం కాదు. వూళ్ళోకి ఎవరు ప్రవేశిస్తున్నా ఆయన్ని తప్పించుకోవటం కష్టం.

"ఏ వూరు?"

"ఫలానివూరు"

"ఏం పనిమీద వొచ్చారు?"

"ఇదిగో వెంకటప్పయ్యగారి పొలం బేరానికుందని తెలిసింది- ధరెంతో కనుక్కుపోదామనీ"

"చాలా ప్రయాసపడి వొచ్చారుగాని మావూళ్ళో చెడిపోయిన వాళ్ళేం వున్నట్టు లేదే! మీరు పొరపాట్న దారితప్పి వచ్చినట్టుంది. అబ్బే! ఇక్కడ అల్లాంటివేంలేవు గానీ తమరు వెంటనే తిరిగి వెళ్తే పదకొండు గంటలబండి అందుతుంది. దయచెయ్యండి."

ఆయన భావయ్యగారు! మనిషి సింహాలుంటయ్యని ఎవరికయినా నమ్మకం కుదరకబోతే ఆ ఎత్తాటి గోడలముందర పొడుగాంటి అరుగుమీద కూచున్న భావయ్యగార్ని చూచిన మరుక్షణం నరసింహావతారం భావనలోకివచ్చి భక్తితో అడుగు వెనక్కు వెయ్యటం కద్దు.

"యీ యింట్లో ఎవరూ లేరేం?" చెరువులాంటి భావయ్యగారిల్లు ఎండినట్లుంటం చూసి పక్కగా బెల్లం నాక్కుంటూ తన నోకంట కనిపెడ్తున్న ఒడ్డెపిల్ల వాణ్ణి చూసి అడిగాడు సత్యం.

"ఓరూ లేరుగా" అన్నా డాపిల్లవాడు సత్యాన్ని యింకొంచెం ఓరచూపు చూస్తూ.

"అదే అడుగుతున్నా-ఏమయినారు?"

"బాగాలు పంచుకుని బత్తీలమీనకు బొయ్యారు భావయ్యగోరు సావంగానే-" అని తుర్రున పరుగెత్తాడు ఒడ్డెపిల్లవాడు, గభాల్న బెల్లంగడ్డ నోట్లోవేసుకొని ఎగురుకుంటూ.

భావయ్యగారు చచ్చిపోయినట్లు ఎప్పుడో ఎవరో తనతో చెప్పినట్లు చప్పున సత్యానికి స్ఫురణ కొచ్చింది. అప్పుడు తనామాట నమ్మినట్టులేదు.

ఊళ్ళోకి పోతూ జరిగిన ఒక్కొక్క మార్పూ సత్యం గమనించాడు. ఇన్నాళ్ళూ పొలం అమ్మకంలో నాన్నకు సాయపడ్తూ వొస్తున్న వెంకటప్పయ్య గారికి కనుపించి మాట్లాడి రంగమ్మగారింట్లో భోజనం చేసి యింకో రెండురోజులకు వారం చెప్పుకున్నాడు.

ఇల్లుమొహం ఒక్కసారి తొంగిచూసి కొంచెంసేపు ప్రయాణపు బడలిక దీర్చుకొని తిరిగి వూళ్ళోకి వద్దామని బయలుదేరేసరికి సుబ్బులు ఎదురుగా వొచ్చాడు.

తనని చూడంగానే సుబ్బులు కావలించుకుని ఏడ్చినంతపనై, చిన్ననాటి స్నేహాన్ని ప్రకటించినందుకు స్వేచ్ఛగా శ్వాసాట్టం మొదలుపెట్టినా, తనతో చదువుకున్న భావనారాయణా, వెంకట్రత్నం, వెంకట్రామయ్యలు తనను చూసీ చూడనట్టు పోవటంకూడా సత్యం గమనించకపోలేదు. సత్యంవెంట పోవటానికి సుబ్బులు సందేహించలేదు.

తాళందీసి యింటి బాహ్యస్వరూపం చూడంగానే కాళ్ళ కీళ్ళు ఒక్కసారి వూడొచ్చినట్లయింది సత్యానికి. అక్కడంతా పచ్చపచ్చటి రంగులు తనని ఆహ్వానిస్తయ్యని సత్యం భావించకపోయినా గోడల్ని నెర్రెలుచేసుకుని పిల్లమర్రి వృక్షాలూ, నేలంతా బీటలు తీసివుండడం– ఎదుర్రొమ్ములో ముల్లుకర్ర పొడిచినట్టయింది సత్యం హృదయానికి.

మూడుగదులూ, ఒక హాలూ, వంటిల్లూ చూసేలోపల ఒక గుమ్మడి గింజల త్రాచుపామునూ, బారన్నర జెర్రిపోతు పిల్లనూ, రెండు తండ్రీకొడుకుల మండ్రగబ్బల్నీ, మూడు ముచ్చుతేళ్ళనూ పారలు పలుగుల్తో గోడవతలవేసి, యీతాకుల చాపలో పరధ్యాన్నంగా ఉన్న పందికొక్కులు, ఎలకల్ని తూముల గుండా అదిలించి, సాలీడు వ్యూహాల్నుంచి మెల్లిగా– ఆవిరిగక్కుతూ – పంచలో గచ్చురుగుమీదికి వచ్చి చేరారు సత్యం, సుబ్బులు.

"మీ ఇల్లు ఓ చిన్న చరిత్రను నిర్మించింది" అన్నాడు సుబ్బులు.

"సిగరెట్టు యింద, కొంచెం మనసు తేరుకుంటుంది."

సిజరుపెట్టి బయటకు తీసి, రెండు సిగరెట్లకు నిప్పు ముట్టించాడు సత్యం.

"ఇంతకూ యీ వూరు నువ్వు ఎందుకు వచ్చినట్టూ? పోయినవాళ్ళు ఎందుకురా మళ్ళీ యిట్లా వొస్తుంటారు మధ్య మధ్యా?"

"నాన్న పొలం వ్యవహారాలు తగిలించాడు" అని దాటేసి "మనవూరు యింత మారిపోయిందేంరా సుబ్బులూ?" అనడిగాడు సత్యం.

"మనుషులు మార్తుంటే వూళ్ళూ మార్తాయి."

"ఏదో పురాతన శిథిలాల్ని చూస్తున్నట్టుంది."

"నువేదో గ్రాంధికంలో మాట్లాడ్తున్నా వేమిటి– గొరిగించిన మొహం లాగా వుందను!"

"ఏం జరిగింది యీ పదేళ్ళలో! ఏ గడపలోనూ జీవం కనుపించటం లేదు. లేక గడిచిన రోజులు గొప్పవని వూహ మటుకేనా?"

"నేను వూళ్ళో వుండేవాణ్ణి గనక నీ మనస్సులో ఎట్లా అనిపిస్తున్నదీ తెలుసుకోవటం కష్టంగాని-మార్పులున్నయిలే."

"బహుశ చిన్నతనపు స్వేచ్ఛ - ఏ యావలు లేకుండా ఆటల్తో గడిపినట్టు వయసు ముదుర్తున్న కొద్దీ ఏర్పడే జంకుతనం కూడా యిట్లా భావించటానికి కారణమై వుండొచ్చు. సంపర్కాల విషయంలో యావలు ఎక్కువై మనుష్యుల్లో మార్పు వొచ్చిందనుకున్నా యిళ్ళ మొహాల సంగతేమిటి? పూర్వం దిష్టి గుమ్మడి కాయలున్నా అందంగా వుండేవి."

"అంతదాకా దేనికి, మీ యింటి సంగతేమిటో చెప్పవోయ్?"

"వొరేయ్ సుబ్బులూ, స్వగ్రామంలోకన్న పరాయి గ్రామంలో ముష్టెత్తుకున్నదానికి తేడా వుందిలేరా. మాకంటే సరే ముద్రపడింది. కాస్త పచ్చపచ్చగా పాడీపంటా వుండే యిక్కడేం చీడపట్టింది, అంతా బూజు వాసన కొట్టుకుంటూ? కనకయ్య వీధిలో ఒక్క పురుగులేదు. ఆశ్చర్యంగా వుంది! మన చిన్నతనంలో ఆ వీధిలో ఇరవైనాలుగు గంటలూ వెలుగులేని వ్యవధి నెరుగుదువా నువ్వూ;"

"ఒరే తండ్రీ, నీ కిక్కడి సంగతులు కొన్ని తెలియవు. వెంకటేశ్వర్లు గారు పోయినాడు. వెంకటసుబ్బయ్య పొలం అప్పుల పాలైనాక పిచ్చెత్తి ఆ గనువుల వెంటే తిరుగుతుంటాడు. బ్రహ్మయ్య కూతురు లేచిపోతే మొహం చెల్లక బయటికిరాడు. వెంకయ్యమామ మర్రిచెట్టుక్రింద సోడాకొట్టు పెట్టుకుని అక్కడే నిద్రపోతుంటాడు. ఇహ మిగిల్నవాళ్ళకు యీ గాలి సోకిందో ఏమో, ఎప్పుడూ బయటికీ లోపలికీ తిరుగుతుంటారు. మరి ఎప్పుడు చూసినా ఆ అరుగుల మీద కుక్కలు పడుకుని పిచ్చాపాటీ మాట్లాడుకుంటుంటయి. ఒకనాడు నేను స్వయంగా చూశాను. ఒక కుక్క ఆ వీధి చివరికి చేరలేదు. అసలు సంగతి ఆ దరిద్రపు సూచనలకు మీ కుటుంబం యిక్కడ నుంచి లేవటం ఒక వుదాహరణేమో!"

నాన్న అప్పుడప్పుడు యిక్కడి సంగతులు టూకీగా చెవిన వేసినా- మనిషిని మనిషి తాకి స్పర్శ ననుభవించినట్టు స్వయంగా చూసి కలుగుతున్న అనుభవంలాగా లేదప్పుడు.

"వెంకయ్య మామకేం - కాస్త బాగా వున్నవాడుగా? సోడాషాపు గతేంబట్టింది?"

"ఒరే, దౌర్భాగ్యానికేంరా? వాతావరణంతో కొట్టుకువొస్తుందీ! ఈ కొంపలన్నిటికీ ఏదో గాకుండా యిట్లా ఏడుస్తుంటయ్యా! యిదుగో, పుటిక్కిన ఎవర్తోనన్నా అనేవు నే చెప్పినట్టు. ఈ వెంకయ్యమామ మూడోపెళ్ళికి దిగొద్దంటే విన్నాడూ? వున్నట్టుండి అమ్మగారికి ఓ బ్రహ్మచారిలో బ్రహ్మత్వం కనుపించింది. పోనీ, ఈ వెంకయ్యమామ ఆ

వున్నదేమో వస్తురూపంలోనన్నా వుంచుకున్నాడా? ఆ గదిలో పాతిపెట్టిన సొమ్మంతా పరబ్రహ్మకు నైవేద్యం చేస్తూ రోజూ యిల్లలికి ముగ్గులు పెట్టేది, వెంకయ్యమామ పసిగట్టడానికి వీల్లేకుండా. ఒకనాడు మంచినక్షత్రం చూసుకుని ఆత్మసంతృప్తికి వెంకయ్యమామ యిట్టే బిందెను జూసి- మరుఘడియలో సోడాషాపు పెట్టుకుని- అక్కడే నిద్రపోతున్నాడన్నమాట మృచ్ఛకటికంలో మాదిరి."

"ఛా!"

"యిహ నీవొంతు యిప్పుడు చెప్పిందంతా మరిచిపోవటం"

"ఆc, ఎవరికి తెలియకుండా వుంటయి ఇవన్నీ?"

"తెలుస్తే బ్రహ్మచారి రోజూ మర్రిచెట్టు కింద కెళ్ళి సోడా తాగొస్తాట్రా?"

"అదొక సరసమేమో?"

"చచ్చుపీనుగ లౌక్యాలన్రా- గడపన్నా తొక్కనిచ్చేవాడు గాదు యీ వెంకయ్య."

"అంతమటుకు అదృష్టమేలే వూర్కో. అన్నట్టు పెదనాన్న - ఆంజనేయులు పెదనాన్న ఎట్లా వున్నాడు?"

"యిల్లెక్కి కూస్తున్నాడు."

"ఆc-?"

"కనకయ్య వీధి సొమ్మంతా ఆంజనేయం అయిందంటే నమ్ము; మరి ఎప్పుడు జూచినా రామాలయంలోగాని కనిపించడు. వేలిముద్దర్లమీద వ్యవహారం నడిపాడనుకో."

"అంటే?"

"అంటే ఏముంది? అప్పుగా వెళ్ళిన సొమ్ము రిజిస్ట్రారాఫీసులో వేలి ముద్దర్లతో భూమి అవతారం దాల్చి తిరిగి వస్తుందన్నమాట."

"మళ్ళీ అంతా దగ్గర బంధువులే!"

"ఘట్టిసొమ్ము గనుక పరాయివాళ్ళకు దక్కలేదు. ఇహ నువ్వూ, నేనూ విచారించడం దేనికి?"

"అంతా మాయగా వుంది! ఇందాక రంగమ్మత్తయ్యగారింట్లో భోంచేసేటప్పుడు నీళ్ళమజ్జిగ పోస్తుంటే పల్లెటూళ్లో - అందుట్లో రంగమ్మత్తయగారింట్లో ఎన్నాళ్ళకు గడ్డపెరుగు తింటున్నామా అని ముందుగానే వూహలు - జరం తగిల్నట్టయి నే నంటే - ఆ నీళ్ళ చుక్కలకే జనం ఎగబడ్తున్నారని ఆవిడ చీమ కుట్టనట్టు అంటుంటే ఎంతాశ్చర్యం వేసిందో నువే ఆలోచించు."

"ఆలోచించే దేమిటి, మనం యిందులో పండిపోతే. ఇంకా నయం! నువు అసలు గ్రామ రాజకీయాల సంగతే తెలియకుండా పైపైవాట్ని గురించి స్థూలాభిప్రాయాలిస్తున్నావ్. మొన్నీమధ్య మన రత్తయ్య పెద్దమనిషితరహాకు వుంచుకుంటున్న రంగయ్య భార్య నాగరత్తమ్మ యింటో నుంచి అర్ధరాత్రి బ్రాహ్మణయ్య నెత్తిన ముసుగుతో తలుపు తెరుచుకుని బయటికి రాబొయ్యే సమయంలో – అదే విధానంలో తలుపుగొట్టే ప్రయత్నంలో గుమ్మంలోనేవున్న రత్తయ్య తారసిల్లాట్ట. మర్నాడు బ్రాహ్మణయ్య ఏడి ఏడని వూరంతా గాలించి, యిట్లా జూస్తే వూరి బయట బందెల దొడ్లో రెండు చాకలివాళ్ల గాడిదెలచాటున దినమొలతో ధ్యాననిద్రలో కూచుని వున్నాట్ట. తెలిసిందా?"

"నువు చెప్పింది జీర్ణించుకుంటానికి కొంత వ్యవధి పట్టుందిరా సుబ్బులు తండ్రీ!"

"నాకు కామయ్యతో తొందరపని వుంది. మళ్ళీ అనకు కలుసుకుందాంలే. పోయి వస్తా" నంటూ వెళ్లాడు సుబ్బులు.

తన వూరును గురించి ఒక అభిప్రాయానికి వొచ్చేసరికి సత్యానికి కునుకుపట్టింది, ప్రాణి అలిసివుంటంవల్ల.

ఆ విధంగా తను ఎంతసేపు పడుకొన్నాడో – ఎక్కడో లాకులు తెరుచుకుని నీరు ప్రవహిస్తున్నట్టు – "ఏమండోయ్ సత్తిమయ్యగోరూ!" అని ఎవరో తనను పిలుస్తున్నట్టనిపించింది సత్యానికి. కలలో గొంతులు లాకుల్లోంచి తప్పించుకున్న నీటిలాగా వుంటయి గావాల్ను అనుకుంటూన్న సత్యానికి మళ్ళీ "యిదేంది యాలగానియాల నిదరబోతుండాడూ?" అన్నట్టయి, గభాల్న కళ్ళుతెరిచి చూశాడు – ఆ మనిషి ఎదురుగా నుంచుని వుంది.

"నేను మాలచ్చిని–" అన్నదా మనిషి కడియాల చప్పుడ్తో. సగం నోరు తెరిచి మూసుకున్నాడు సత్యం.

"కొండడు మిమ్మల సెపటాకాడ సూశాడంటా – సెప్పాడు" అన్నది.

పదేళ్ళ క్రిందట మాయింట్లో పనిజేసేది మహలక్ష్మి. ఎట్లా పెరిగింది?

"అంతా బాగుండారా – అమ్మా, నాన్నా – యింకా నిదరమైకం వొదల్లే దెట్టా?"

"ఏం మహలక్ష్మీ–" నిద్రపోయేవాణ్ణి గబగబ లేపి నీళ్ళు పొర్తున్న నారుమళ్ళ మధ్యన కూచోబెట్టినట్టయింది సత్యానికి.

"గురు తుండదా!"

"వుండు. నిద్రపట్టింది–"

"యిదేంది. లెగిసి కూకుని మళ్లీ అట్టంటాడూ!"

"అదికాదు. నిన్ను చప్పున గుర్తుపట్టలేకపోయినా–" అంత పెద్దదయినా మహలక్ష్మిలో మార్పు లేకుండా అదేవిధంగా మాట్టాట్టం చూసి సత్యం కాస్త తికమకలో పడ్డాడు.

"బలేవోరండీ!"

"నుంచున్నావేం కూచో."

"అబ్బే. ఎల్లాలండీ, ఆయ నొచ్చే యాలయిందీ. అమ్మోళ్ళంతా బాగుండారుగా?"

"ఆ, వున్నారట్లా – నీకు పెళ్ళయిందా?"

"అప్పుడే అయిందిగా!"

"పిల్లలా?"

"ఆఁ, ఆళ్లుకూడా దేనికిలెండి, మొదులే కూటికి కనాకష్టంగా వుంటే!"

"అదేమిటి – నీ మొగు డేం పని చేయడా!"

"మొగు డొక్కడే ఏం కర్మ! యిద్దరం జేత్తుండా అంతంత మాత్రంగానే వుంది. యిదుగో, ఏవండోయ్, ఎనక మీయింటో పనిజేసే దినాల్లోనే బాగుందండీ! యిప్పుడంతా బొహు దరిద్రం గుండది."

"మరి పెళ్ళంటే ఏ మనుకున్నావ్?" అని చూశాడు సత్యం.

"ఆయన కేవండోయ్, సానా మంచోడయితే – మీకు తెలవదు గావాల్ను? – కూలిగింజ లీయక పానాల్దీసుకు తింటున్నారండీ."

"ఎవరూ?" డబ్బులకు కాదుగదా అనుకున్నాడు సత్యం.

"ఎవరేంది, ఆసాములు కాక యింకెవ రుంటారూ? యిదేందండి, నాట్లేసినా, కోతగోసి కుప్పలు నూర్చినా, గింజలు కొలవక డబ్బిత్తానంటా రేందండీ! ఆ డబ్బులు కాత్తా కోమటాయన దగ్గిరికి తీసికెళ్ళి గింజలు కొలవమంటే నాలుగు గుప్పిళ్ళు వొళ్ళో దులిపి పోమంటున్నాడు. ఇదేం అన్నాయమండి, యిన్నాళ్లూ మా గూడెం మదుసులు యిట్టాటివి ఏమన్నా ఎరుగుదురూ?"

"అదే నాకు బోధపడకుండా వుంది!"

"శాకిరి చేసేదంతా మేమూ – గోతాల్లో పోసీ, పొయ్యక తలికే గింజలు కాన్రాకుండా సేసి ఏడిపిచ్చుకు తింటుండారు. మా కూలోళ్ళను పస్తుపొడుకోబెడ్తే ఆళ్ళకేం లాబం వొచ్చుద్ది మీరే సెప్పండి? మా గూడెంలో మదుసులు ఎట్టుండారో ఓపాలి వొచ్చి చూడండి మీకే తెలుసుద్ది!"

"అన్యాయం!"

"అన్నాయ మేందీ, మొన్నామద్దె మా లచ్మయ్య ముటా గింజలుకొలుత్తే గాని యీలులేదని పేసీ పెద్తే, లచ్మయ్య, లచ్మయ్యకొడుకుని యీపులు పగల గొట్టిచ్చారు – సూశారంటండీ?"

"మరి ఎవరన్నా పెద్దమనుష్యుల్తో చెప్పలా మీరూ!"

"ఆ మద్దు లెవరో ఎవరూ కాన్రారు!"

"ఏదో సద్దుకుని పోవటం వుండాలిగా మరి."

"యింకా సద్దుకునేదేం వుండది, పానం నీలుగారి పోతుంటే! సచ్చేది గూడెంలోనే కూకుని సద్దామని ఏ పనికీ పోకుండా అంతా అటనే గూడెంలో కూకుండారు– కడుపు కాలిపోతుండది."

ఇంతలో ఓ పొడుగాంటి చువ్వలాంటిమనిషి కళ్ళు మెరిపిస్తూ, తుబుక్కున వుమ్మేసుకుంటూ వొచ్చి మహలక్ష్మి పక్కన నుంచున్నాడు.

ఆ వొచ్చిన మనిషెవరో తననూ, మహలక్ష్మినీ ఎత్తి నేలకేసి కొడ్తాడను కున్నాడు సత్యం.

"నేను సుబ్బణ్ణి లెండి" అన్నా డా మనిషి ఒక్కసారిగా నవ్వుతూ.

మహలక్ష్మి మొహం ఓరగా పెట్టుకుని సుబ్బడి వెనకకు జరుగుతూ నవ్వింది.

"మిమ్మల గురించి సెబ్తావుంటది లెండి – యిహీ!" అని నవ్వాడు సుబ్బడు గిరిజాలు వెనక్కి ఎగరేసుకుంటూ.

"కొంచెం పని వుండి వొచ్చా–" యీ మనిషి నవ్విందిగాని మాట్లాడ్డు గావాల్ను అనుకుంటున్నాడు సత్యం.

"గూడెంలో కాత్తె పని వుండది. దొబ్బున ఎల్లాల. రాయే, దొబ్బునెల్దాం–" అంటూ గబగబ యిద్దరూ చేతులు పట్టుకుని వెళ్ళిపోయినారు.

ఒక్కసారి ఫిలిం తెగి లైట్లు వెలిగినట్టయింది సత్యానికి. మహలక్ష్మి ఎంత మారింది! ఎంత మార్పు యీ మనుషుల్లో!

తన ఆప్తవర్గంలోని పతనాన్ని వెళ్ళబోసిన సుబ్బులూ, తమ గూడెంలోని మనుషుల్తో సమభాగంగా నిలబడి పరుగెత్తుకువెళ్ళిన ఆ దంపతులూ– ఆ శూన్యంలో తనముందు నృత్యం చేస్తున్నట్టనిపించింది సత్యానికి.